క్లుప్తంగా

ఆలయ ముఖద్వారం ప్రారంభం



సీతారాముల ఆలయ ముఖద్వారం

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని ముస్లాపూర్‌లోని సీతారాముల ఆలయ ముఖ ద్వారాన్ని నూతనంగా నిర్మించారు. ఈ ముఖ ద్వారానికి ఆలయ నిర్వాహకులు సోమవారం ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ ప్రాచీన ఆలయంలో కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకమని పూజారులు చెబుతున్నారు.

కొప్పోల్‌లో కాశీ బుగ్గ దర్శనం



శివలింగం చుట్టూ చేరిన కాశీబుగ్గ

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయంలో కాశీబుగ్గ దర్శనమిచ్చింది. సోమవారం ఆలయంలోని శివలింగం చుట్టూ కాశీబుగ్గ(నీరు) రావడంతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ సోమవారం కాశీబుగ్గ రావడాన్ని భక్తులు ఆనందంగా తిలకించారు. ఈ మేరకు ఆలయ కమిటీ అధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్ లెక్చరర్ల పోస్టుల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జువాలజీ, గణిత పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారు పాఠశాలలోని కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీంతో పాటు ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఎంపీసీలో 30, బైపీసీలో 27, సీఈసీలో 16 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

రోడ్డు గుంతలమయం



చల్మెడ కమాన్ నుంచి నందగోకుల్ రహదారిపై ఏర్పడిన గుంతలు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ రమాన్ నుంచి నందగోకుల్ వెళ్లే రహదారిని మధ్యలోనే అసంపూర్తిగా వదిలేయడంతో గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల ఈ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ కంకర వేసి వదిలేశారు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు గుంతలమయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

కల్వర్టుల పరిశీలన



వెంకటపూర్‌లో కల్వర్టును పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి దేవ్ కుమార్

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని పలు గ్రామాల్లో రాత్రి కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఈ తరుణంలో ప్రమాదకర బ్రిడ్జిలను సోమవారం మండల ప్రత్యేకాధికారి దేవ్ కుమార్ పరిశీలించారు. ఈ మేరకు మండల పరిధిలోని చల్మెడ, వెంకటపూర్ గ్రామాల్లోని కల్వర్టులను పరిశీలించారు. అనంతరం శిథిలావస్థకు చేరుకున్న నార్లాపూర్‌లోని ఇంటిని పరిశీలించారు. అలాగే నందిగామ, బచ్చురాజ్‌పల్లిలలో నిండిన చెరువులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాజరెడ్డి, ఆర్ఐ ఇమ్మాద్, కార్యదర్శులు వెంకట నర్సింహరెడ్డి, రాములు, ప్రేమ, నర్సింలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని అప్పాజీపల్లిలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వామి వారికి అభిషేకం, అలంకరణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

యూరియా కష్టాలు

బారులు తీరిన రైతులు

- పోలీసుల పర్యవేక్షణలో టోకెన్ల పంపిణీ



జంగరాయి సొసైటీ వద్ద యూరియా కోసం బారులుతీరిన రైతులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులకు సరైన సమయంలో యూరియా అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం మండల పరిధిలోని సోమక్కపేట్ పీఏసీఎస్‌కు 500 బస్తాలతో ఓ లారీ లోడ్ వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న రైతులు యూరియా బస్తాల కోసం ఒక్కసారిగా పీఏసీఎస్ పోటెత్తారు. దీంతో అదుపు చేయలేని పీఏసీఎస్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే పీఏసీఎస్ వద్దకు చేరుకొని చర్యలు చేపట్టారు. పోలీసుల సహకారంతో పీఏసీఎస్ సిబ్బంది ముందుగా రైతులకు టోకెన్లు అందజేసి ఆ తర్వాత యూరియా బస్తాలు ఇచ్చారు.

యూరియా కొరతతో ఇబ్బందులు

యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని సోమక్కపేట్ మాజీ సర్పంచ్ బెస్త లక్ష్మణ్ తెలిపారు. లారీ లోడ్ వచ్చిన వెంటనే రైతులు ఎగబడాల్సిన పరిస్థితి ఎప్పుడు రాలేదన్నారు. జిల్లాలో యూరియా కొరత లేదంటూ అధికారులు మభ్య పెడుతున్నారన్నారు.

కౌడిపల్లిలో..



కౌడిపల్లి రైతువేదికలో టోకెన్లు ఇస్తున్న అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్): యూరియా కోసం రైతులు బారులు తీరారు. వ్యవసాయ అధికారులు టోకెన్లు ఇస్తామని చెప్పడంతో సోమవారం కౌడిపల్లిలోని డీసీఎంఎస్ రైతుసేవా కేంద్రానికి రైతులు గుంపులుగా ఎగబడ్డారు. వెంటనే వ్యవసాయ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసుల పర్యవేక్షణలో రైతులకు టోకెన్లు పంపిణీ చేశారు. అయితే డీసీఎంఎస్ రైతుసేవా కేంద్రానికి 560బస్తాలు రావడంతో రైతులను వరుసలో నిలబెట్టి ఏఓ స్వప్న, ఏఈఓలు స్రవంతి, సాహితి డీసీఎంఎస్ ప్రతినిధులు టోకెన్లు ఇచ్చారు.

వర్షంలో తడుస్తూనే..

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని జంగరాయి సహకార సంఘం వద్ద యూరియా కోసం రైతులు వర్షంలో తడుస్తూనే బారులుతీరారు. వారం రోజులుగా యూరియా అందుబాటులో లేకపోవడంతో సోమవారం జంగరాయి సొసైటీకి యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు యూరియా కోసం క్యూలో గంటల తరబడి నిల్చుని టోకన్లు తీసుకున్నారు. ఒక్కరికి ఒక బస్తా మాత్రమే అందిస్తామని చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఏఓ అనుమతితో రెండు బస్తాలు అందించారు. కాగా, 450 బస్తాల యూరియా వచ్చిందని పీఏసీఎస్ సెక్రటరి బాలకిష్టయ్య తెలిపారు.



టోకెన్లు తీసుకునేందుకు ఎగబడుతున్న రైతులు

చేగుంటలో..

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని మక్కరాజీపేట రోడ్డులో ఫర్టిలైజర్ షాపుల్లో యూరియా వచ్చిందని విషయం తెలుసుకున్న రైతులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. వెంటనే మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ షాపు వద్దకు చేరుకొని టోకెన్లు అందించారు. మొత్తం 560 బస్తాల యూరియా రావడంతో అందరికీ యూరియాను అందజేశామన్నారు.



పూజలు చేసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి

గంగమ్మతల్లికి నాయకుల పూజలు

నర్సాపూర్: చెరువు కట్టపై వెలిసిన దేవతలతో పాటు గంగమ్మ తల్లికి ఆయా పార్టీల నాయకులు సోమవారం పూజలు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రాయరావు చెరువు నిండి అలుగులు పారుతోంది. ఈ నేపథ్యంలో నాయకులు కట్టపై వెలిసిన మైసమ్మ, ఎల్లమ్మ దేవతల ఆలయాలతో పాటు గంగమ్మతల్లికి పూజలు చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆలయాలతో నాటు చెరువులో పూజలు చేశారు. అదే విధంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ తన పార్టీ నాయకులతో కలిసి పూజలు నిర్వహించారు. అలాగే పట్టణానికి చెందిన ముస్లింలు ఆనవాయితీ ప్రకారం.. ప్రత్యేకంగా తయారు చేసిన తెప్పతో చెరువు వద్దకు చేరుకుని చెరువు వద్ద ప్రార్థనలు చేశారు.

చెరువుకట్ట గుట్టపై అక్రమ తవ్వకాలు

నర్సాపూర్: మండల కేంద్రంలోని రాయరావు చెరువు కట్టను ఆనుకుని ఉన్న గుట్ట నుంచి అక్రమ మట్టి తవ్వకాలు అడ్డగోలుగా చేపడుతున్నారు. ఆయా శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో మట్టిని తవ్వి తరలిస్తున్నారు. సోమవారం పట్టపగలు గుట్ట సమీపంలో జేసీబీలతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. ఈ చెరువుకట్టను ఆనుకుని గుట్ట నుంచి మట్టిని తవ్వితే రానున్న రోజుల్లో చెరువు కట్టకు ప్రమాదం పొంచి ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల చెరువు కట్ట గుట్ట వద్ద జేసీబీలతో మట్టి తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా తరలించడం పరిపాటిగా మారింది. ఇలా అక్రమంగా మట్టి వ్యాపారులు ఇష్టానుసారంగా గుట్ట నుంచి మట్టి తవ్వి తరలించడంతో గుట్ట కనుమరుగవుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుని గుట్టను కాపాడి చెరువు కట్టకు ఎలాంటి ప్రమాదం సంభవించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయపై ఆర్ఐ ఫైజల్‌ను వివరణ కోరగా.. చెరువు కట్టను ఆనుకుని ఉన్న గుట్ట నుంచి మట్టి తరలిస్తున్న విషయం తన దృష్టికి రాలేదని, తాను పరిశీలిస్తానని చెప్పారు.



గుట్టను అక్రమంగా తవ్వి మట్టిని ట్రాక్టర్‌లో నింపుతున్న జేసీబీ

వర్షానికి నీటమునిగిన పత్తిపంట



టేక్మాల్ శివారులో వరదనీటితో పాడైన పత్తి పంట

టేక్మాల్(మెదక్): మండలంలో వర్షం బీభత్సం సృష్టించింది. ఆదివారం 148ఎంఎం వర్షపాతం నమోదైంది మండలంలోని బొడ్మట్‌పల్లిలో ఇళ్లలోకి, దుకాణ సముదాయాల్లోకి వరదనీరు రావడంతో ఇబ్బందులు పడ్డారు. చల్లపల్లి డ్యు కొట్టుకుపోగా.. గుండువాగు ఉధృతంగా ప్రవహించడంతో జోగిపేట -టేక్మాల్, ఎలకుర్తి–జోగిపేట రాకపోకలు నిలిచిపోయాయి. దనూర చెరువు కట్ట రోడ్డుపై పారింది. ఈ వర్షాలకు కోరంపల్లి, పల్వంచ, కొత్తపల్లి గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెరువుకుంటలు అలుగులు పారడంతో పత్తి, వరి పొలాలు నీట మునిగాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ

మనోహరాబాద్(తూప్రాన్): కొంతకాలంగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతేనే తప్ప బయటకు రావొద్దని డీఎస్పీ నరేందర్‌గౌడ్ సూచించారు. సోమవారం మండలంలోని రామాయపల్లి వద్ద జాతీయ రహదారి 44పై గల రైల్వే అండర్‌పాస్‌ను పరిశీలించారు. ఆయన వెంట సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ సుభాష్‌గౌడ్‌లున్నారు.

నర్సాపూర్ రూరల్: భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ మధులత సూచించారు. సోమవారం ఎంపీఓ వైద్య శ్రీనివాస్, మండల స్థాయి సిబ్బందితో కలిసి ఆమె నారాయణపూర్, అచ్చంపేట, ఖాజీపేటలోని చెరువులు, కుంటలతో పాటు గ్రామాలను సందర్శించారు.



రైల్వే అండర్ పాస్‌లో చేరిన నీటిని పరిశీలిస్తున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ, ఎస్ఐ

● ఏటీఎంలకు ముసుగు

పట్టణంలోని ఎస్‌బీఐ ఏటీఎంకు వర్షం తిప్పలు తప్పడం లేదు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలోని ఎస్‌బీఐ వద్ద ఉన్న ఏటీఎం గది ఉరుస్తుంది. దీంతో బ్యాంక్ సిబ్బంది రెండు ఏటీఎం మిషన్లకు ముసుగులు కప్పి డస్ట్ బిన్లు ఏర్పాటు చేశారు. దీంతో ఏటీఎంకు నగదు కోసం వచ్చే ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - నర్సాపూర్ రూరల్



వైభవంగా మార్కండేయ ఆలయ వార్షికోత్సవం



శివపార్వతుల కల్యాణోత్సవంలో భక్తులు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని భక్త మార్కండేయ ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతుల కల్యాణోత్సవంతోపాటు శని భగవానుడి విగ్రహా ప్రతిష్ఠోత్సవం నిర్వహించారు. అలాగే పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గణపతి హోమం, రుద్రాభిషేకం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఆ సంఘం అధ్యక్షుడు రమేష్, నాయకులు సత్యం, యాదగిరి, సుధాకర్, మోహన్, నరేందర్, రాజమౌళి, మహిళలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అటవీభూమిలో అక్రమంగా సాగు.. ట్రాక్టర్ సీజ్

కౌడిపల్లి(నర్సాపూర్): అటవీభూమిలో అక్రమంగా సాగుచేసి దున్నతున్న ట్రాక్టర్‌ను సోమవారం అటవీశాఖ అధికారులు సీజ్ చేశారు. కౌడిపల్లి ఎఫ్ఆర్ఓ అర్చన, భుజిరంపేట సెక్షన్ అధికారి శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకటాపూర్(బి) పంచాయతీ పరిధిలోని అటవీభూమిలో రాత్రి సమయాల్లో చెట్లను నరికి భూమి చదును చేస్తున్నారన్నారు. ఈ మేరకు వరి నాటు వేసేందుకు ట్రాక్టర్‌తో దున్నతుండగా.. సమాచారం మేరకు పట్టుకుని సీజ్ చేశామన్నారు. అనంతరం శేఖర్‌తోపాటు ట్రాక్టర్ యజమానిపై కేసునమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

◆ కూలిన ఇళ్ల పరిశీలన

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంతో పాటు కన్నారం, తునికి, కుషన్‌గడ్డతండా గ్రామాల్లో కూలిన ఇళ్లను డీఎల్‌పీఓ సాయిబాబ, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్ల సోమవారం పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లల్లో నివాసం ఉండవద్దని సూచించారు. వీరందరికీ ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ హాల్‌లో వసతులు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. కౌడిపల్లికి చెందిన వంజరి భిక్షపతి ఇల్లు కూలిపోడంతో ఎంపీడీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం పరిశీలించారు. అనంతరం వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు ఉన్నత పాఠశాలలో ఉండాలని సూచించారు.

◆ విద్యార్థులకు క్రీడా దుస్తుల అందజేత

చేగుంట(తూప్రాన్): మండల పరిధిలోని కసాన్‌పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వివేకానంద సేవా సమితి సభ్యులు సోమవారం క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ కేంద్రంగా పనిచేసే సేవాసమితి సభ్యులు రూ.20 వేల విలువ చేసే దుస్తులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సంగీత, సొసైటీ సభ్యులు సచిన్, మహేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కరీం, హరీష్‌రెడ్డి, నిఖిలారెడ్డి, ఉపాధ్యాయుడు రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

◆ కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రధాన రోడ్డు కోతకు గురి కావడానికి కారకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పోతులబోగూడ వద్ద వెల్దుర్తి–ఉసిరికపల్లి ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు పైపులకు కొంతమంది అడ్డుగా ఇనుప జాలీలు అడ్డుపెట్టారు. దీంతో చెత్త పేరుకుపోయి రోడ్డు తెగిపోవడానికి కారకులయ్యారు. ఇందులో భాగంగానే ఆర్అండ్‌బీ ఏఈ మహేష్ ఫిర్యాదు మేరకు పోతులబోగూడకి చెందిన దశరథం, ప్రవీణ్, శేఖర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

◆ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో భారీగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయన్నారు. ప్రజలు వాగులు, దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారులను సంప్రదించి తగిన సూచనలు, సహాయ సహకారాలను పాటించాలన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నకు ఘన నివాళులు



కర్నాల్‌పల్లిలో సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు



నర్సాపూర్‌లో పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



రామాయంపేటలో సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం ప్రతినిధులు

అల్లాదుర్గం(మెదక్): మండలంలోని గడిపెద్దాపూర్, చిల్వెర గ్రామాలలో సోమవారం గౌడ సంఘం సభ్యులు సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాజుగౌడ్, కృష్ణగౌడ్, శ్రీనుగౌడ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నివాళులు..

రామాయంపేట(మెదక్): మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా గౌడ సంఘం ప్రతినిధులు సోమవారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులు కృష్ణాగౌడ్ సిద్దరాంలు, ప్రతినిధులు పృథ్వీరాజ్‌గౌడ్, శంకర్‌గౌడ్, స్వామి, యాదగిరి, నగేశ్, నాగరాజు పాల్గొన్నారు.

నర్సాపూర్: సర్దార్ సర్వాయ్ పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజిరెడ్డి, స్థానిక మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌గౌడ్, పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ నివాళులర్పించారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో..

పెద్దశంకరంపేట(మెదక్): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నారాగౌడ్, సుభాష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజన్‌గౌడ్, పెరుమాండ్లగౌడ్, రాజేందర్‌గౌడ్, భానుగౌడ్, శంకర్‌గౌడ్, విఠల్‌గౌడ్, సతీష్‌గౌడ్, వినయ్‌గౌడ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్‌అలీ తదితరులున్నారు.

టేక్మాల్‌లో..

టేక్మాల్(మెదక్): మండలంలోని కుసంగి, బొడ్మట్‌పల్లిలో గ్రామాల్లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సంగమేశ్వర్ గౌడ్, నాయకులు పాపయ్య, రాజేష్ గౌడ్, భాస్కర్, షేక్ మజర్, చింత రవి, కమ్మరి సిద్దన్న, అశిలి సాగర్, చల్ల అనిల్, సేవాలాల్, సక్రు నాయక్, సర్దార్, సంతోష్, వివిధ గ్రామాల గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి..

చిన్నశంకరంపేట(మెదక్): సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని మండల కాంగ్రెస్ నాయకుడు రాజ్‌కుమార్‌గౌడ్ కోరారు. సోమవారం మండలంలోని సూరారంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పవన్‌గౌడ్, గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడు దుర్గాగౌడ్, కిషన్‌గౌడ్, కార్యదర్శి నాంపల్లి పాల్గొన్నారు. అలాగే మండలంలోని భాగీరథపల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు నరేష్‌గౌడ్, శివలింగంగౌడ్, మాజీ ఉప సర్పంచ్ సాయిబాబాగౌడ్, నర్సాగౌడ్ ఉన్నారు.

రామాయపల్లిలో..

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని రామాయపల్లి ప్రధాన చౌరస్తా వద్ద సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు వెంకటేష్‌గౌడ్, సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంతో పాటు కర్నాల్‌పల్లి ఎల్లమ్మ ఆలయం వద్ద సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

బైక్ ర్యాలీ..

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలో సోమవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార పాపన్న చిత్రపటానికి మాజీ జడ్పీటీసీ బాలాగౌడ్, ఏడుపాయల దేవస్థాన మాజీ చైర్మన్ బాలాగౌడ్, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు ఎల్లాపూర్‌నుంచి బైక్ ర్యాలీగా బయలుదేరారు.



పాపన్నపేటలో నివాళులర్పిస్తున్న గౌడ సంఘం సభ్యులు

కరువు తీరా వానలు..

మత్తడి పోస్తున్న చెరువులు


జిల్లా వ్యాప్తంగా కరువు తీరా వర్షాలు కురిశాయి. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి చెరువులు, కుంటలు నిండుకుండలా మారి అలుగులు పారుతున్నాయి. పలు చోట్ల అలుగులు పారడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



చిలప్‌చెడ్: సోమక్కపేట్ లింగం చెరువు వద్ద పారుతున్న అలుగు



తూప్రాన్: పట్టణ సమీపంలో పొంగిపొర్లుతున్న కిష్టాపూర్ చెక్‌డ్యాం



నర్సాపూర్: అలుగులు పారుతున్న నర్సాపూర్ రాయరావు చెరువు



శివ్వంపేట: మత్తడి పోస్తున్న గోమారం చెరువు